బీజేపీతోనే దేశాభివృద్ధి


అలకాపూర్ టౌన్‌షిప్‌లో ప్రచారం చేస్తున్న సంగీతారెడ్డి

మణికొండ: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఎంజీ పార్కులో వాకర్స్‌ను ఆదివారం కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 ఏళ్లలో జరగని అభివృద్ధి బీజేపీ పాలనలో శరవేగంగా జరిగి దేశం రూపురేఖలు మారిపోయాయన్నారు. దేశ వ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్టులు, పోర్టులు, రక్షణ రంగంలో పురోభివృద్ధి, దేశ రక్షణ లాంటి అనేక రంగాల్లో దేశం అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అలాగే మూడేళ్లుగా పేదలకు ఉచిత రేషన్, ఉచిత వైద్యం లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు సి.బీరప్ప, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మీరాములు, నాయకులు వేణుకుమార్, శంకర్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికే ఆదర్శంగా భారత్..

రాజేంద్రనగర్: భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటుతున్న ఘనత పీఎం నరేంద్ర మోదీకే దక్కుతుందని చేవెళ్ల బీజేపీ ఎంపీఅభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతా రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని పలు కమ్యూనిటీల ప్రతినిధులతో ఆదివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మోదీ ప్రధానమంత్రిగా వచ్చినప్పటి నుంచి మనదేశానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పెరిగిందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ పాలనదక్షత, ముందు చూపుతో మన దేశం అగ్రరాజ్యాల సరసన నిలిచిందని ఆమె కొనియాడారు. విజయవంతమైన పారిశ్రామిక వేత్తగా నిరూపించుకున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి సామాన్య ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లో వచ్చారని తెలిపారు. గతంలో ఆయన ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్ల అభివృద్ధికి చేసిన కృషిని ఆమె వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలంతా అండగా ఉండి గెలిపించాలని కోరారు. అనంతరం కమ్యూనిటీ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి గెలుపులో భాగమవుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అత్తాపూర్‌లోని సింఫనీ గేటెడ్ కమ్యూనిటీ మల్లారెడ్డి, బీజేపీ పార్లమెంటు కన్వీనర్ విజయ్ కుమార్, అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సంగీత గౌరేశ్, కొండా గౌతమి రెడ్డి, వినోద్ కుమార్, సీనియర్ నాయకులు, అగర్వాల్ సమాజ్ కమిటీ దామోదర్, నరేశ్, సంతోష్ జాజు, ప్రమోద్ పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్ పనులు జరిగేనా..?

- శంషాబాద్‌లో రూ. 2 కోట్లతో నిర్మాణం
- ఇంకా సెల్లార్ దశలోనే పనులు
- నిధుల విడుదలకు బ్రేక్
- మరోవైపు శరవేగంగా మున్సిపల్ కార్యాలయ భవనం పనులు


గుంతల దశలనే నిలిచిపోయిన మోడల్ మార్కెట్ పనులు

శంషాబాద్: పట్టణంలోని సింప్లెక్స్ సమీపంలో రూ. 2 కోట్ల నిధులతో చేపట్టిన వెజ్, నాన్‌వెజ్ మోడల్ మార్కెట్ పనులు సందిగ్ధంలో పడ్డాయి. గత సర్కారు ప్రతి పట్టణంలో ఓ మోడల్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. దానిలో భాగంగా పట్టణంలోని సింప్లెక్స్ వద్ద హెచ్ఎండీఏకు సంబంధించిన ఎకరం స్థలంలో వెజ్, నాన్‌వెజ్ మోడల్ మార్కెట్‌ను నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాగా ఎనిమిది నెలల కిందటే సెల్లార్ పనులు చేపట్టారు. అయితే సెల్లార్ నిర్మాణంలో నీళ్లు రావడంతో పనులు కొన్ని రోజులు ఆపేశారు..

ఎన్నికల తర్వాత నిధుల మంజూరుకు బ్రేక్..

ఎన్నికల అనంతరం టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా 50 శాతం పనులు పూర్తయిన వాటికి మాత్రమే పురపాలక శాఖ నిధులు విడుదల చేస్తోంది. అయితే ఈ మోడల్ మార్కెట్ పనులు మాత్రం 2 శాతం కూడా కాకపోవడంతో ఈ ప్రాజెక్టును పురపాలక శాఖ ప్రస్తుతానికి పక్కన పెట్టేసి నిధుల విడుదలకు బ్రేక్ వేసింది. దీంతో ప్రభుత్వం మరోసారి నిర్ణయం తీసుకున్న తర్వాతు మోడల్ మార్కెట్ పనులు పట్టాలెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మరోవైపు శరవేగంగా మున్సిపల్ కార్యాలయం పనులు..

మోడల్ మార్కెట్ పక్కనే హెచ్ఎండీఏ కేటాయించిన స్థలంలో చేపట్టిన మున్సిపల్ కార్యాలయం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ. 5.70 కోట్లతో అన్నిహంగులతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఎన్నికల నాటికే కార్యాలయం పనులు 50 శాతం పూర్తి కావడంతో పురపాలక శాఖ పనులు పూర్తయ్యేందుకు నిధులు విడుదల చేసింది. మరికొద్ది నెలల్లోనే మున్సిపాలిటీ భవనం అందుబాటులోకి రానున్నది.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి


మణికొండలో మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

మణికొండ: సేవా కార్యక్రమాలతో సంతృప్తి కలుగుతుందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ మర్రిచెట్టు కూడలిలో లక్ష్య ఫుడ్‌వేస్ వారు ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యేటా మణికొండలో మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డి. పురుషోత్తం, నాయకులు సి.బీరప్ప, ఎం.రాఘవరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, బి.రవికాంత్‌రెడ్డి, బి.ముత్యాలు, కిరణ్‌కుమార్, మహేష్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి


ప్రశాంత్‌నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మిద్దెల ప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సీనియర్ నాయకుడు మిద్దెల ప్రేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో విజయ్ పద్మనాభన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సుధాకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ హైదర్‌గూడ చౌరస్తాలో..


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీరాం రెడ్డి

రాజేంద్రనగర్: అత్తాపూర్ హైదర్‌గూడ చౌరస్తాలోని పిల్లర్ నంబర్ 143వ వద్ద రాంపాప్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీఆర్ఎస్ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు వనం శ్రీరాం రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గుబాయి, కన్నాబాయి, ప్రజాపతి, సంజు మాస్టర్, అంబదాస్, జైహింద్ రెడ్డి, పన్నాలాల్, సంతోష్, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి


రోడ్డుపై నిలిచిన నీటిని చూపిస్తున్న చిలకమర్రి నర్సింహ

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల–ముచ్చింతల్ దారిని పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ముచ్చింతల్ శివారు రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే.. పనులు చేపట్టకుండా తాత్సర్యం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులను ఇందుకు బాధ్యులు చేయాలన్నారు. ఈ రోడ్డు సౌకర్యం లేక ముచ్చింతల్ నుంచి పాల్మాకుల వెళ్లేందుకు స్థానికులు వేరే మార్గాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు పునఃరుద్ధరణతో పాటు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

సింక్రోనీకి 'బాక్స్ ఎంప్లాయీస్' అవార్డ్

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ సింక్రోనీ.. యాంబిషన్ బాక్స్ ఎంప్లాయీస్ చాయిస్ అవార్డ్ అందుకుంది. మూడు అంశాలలో మెరుగైన పనితీరుతో టాప్ 20 మిడ్–సైజ్ కంపెనీలలో ఒకటిగా ఈ అవార్డు సాధించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కంపెనీల ప్రస్తుత, మాజీ ఉద్యోగుల రేటింగ్‌లు సమీక్షల ఆధారంగా యాంబిషన్ బాక్స్ ర్యాంక్స్ అందిస్తుందని, ఈ ఏడాది 50 వేలకు పైగా కంపెనీలు పోటీపడగా 14 లక్షలమంది ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారని వివరించారు.

వైట్‌హౌస్ సెట్‌తో హ్యాండీ క్రాఫ్ట్ మేళా

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ సంగం వద్ద వైట్‌హౌస్‌ను తలపించేలా హ్యాండ్‌క్రాఫ్ట్స్ మేళా రూపుదిద్దుకుంటుంది. చిన్నారులు, పెద్దలను ఆకర్షించేలా నూతన సెట్‌లతో అందమైన ప్రసిద్ధ ఆకృతులను తయారుచేయడం వీరి ప్రత్యేకత. నిర్వాహకుడు రాబ్సన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఇన్‌ఫాన్ట్ హ్యాండ్లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా లక్షల జనాల మన్ననలు పొందింది. ప్రస్తుతం లంగర్‌హౌస్ సంగం వద్ద ఈ సెట్ ఏర్పాటు జరుగుతుంది. ఈ మేళాలో పిల్లలు ఆడుకునేందుకు మరిన్ని కొత్త వస్తువులను ఏర్పాటు చేయడంతో పాటు, మగువలను ఆకట్టుకునే వివిధ వస్తువులను అమ్మకానికి అందుబాటులో ఉంచుతామని రాబ్సన్ చెప్పారు.

నిరంతర సాధన అవసరం

గన్‌ఫౌండ్రీ : సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టుదల, ఏకాగ్రత కలిగి ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నారాయణ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 'సివిల్స్ సన్నద్ధం అవ్వడం ఎలా..?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సివిల్స్‌కు నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు. తన చిన్నతనంలో చోటు చేసుకున్న ఘటనలు, తన తండ్రితో ఉన్న అనుభవాలను అభ్యర్థులతో పంచుకున్నారు. చిన్న చిన్న విషయాలతో పాటు అనేక విషయాల గురించి అభ్యర్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఎంతో ఓపికగా సమాధానం చెప్పారు. సివిల్స్ విద్యార్థుల కోసం ఇలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. పరిశోధన, అభివృద్ధి ఎంతో కీలకమని అభ్యర్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ విశ్రాంత చీఫ్ సెక్రటరీ మోహన్ కందా, అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీవీపై రచించిన 'జాతిరత్నం' మార్గదర్శకం

గన్‌ఫౌండ్రీ: దేశానికే గర్వకారణమైన మహోన్నత వ్యక్తి పీవీ నరసింహారావు తన తండ్రి కావడం తనకెంతో గర్వకారణంగా ఉందని శాసనమండలి సభ్యులు సురభి వాణీదేవి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జయమిత్ర సాయిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆచార్య చెన్నకేశరెడ్డి 80వ జన్మదినం సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ నవీన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన ఎలనాగలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పీవీ నరసింహారావుపై రచించిన గ్రంథం అందరికి మార్గదర్శకమన్నారు. అనంతరం 80 వసంతాలు పూర్తి చేసుకున్న పలువురు సాహిత్యకారులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి, ఓయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, కవి ఆచార్య లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు నాళేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.

కొమర వెంకటేశ్ సేవలు మరువలేనివి


కొమర వెంకటేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: చిత్ర పరిశ్రమ కార్మికులు, హౌసింగ్ సొసైటీ సభ్యులకు మాజీ అధ్యక్షుడు కొమర వెంకటేశ్ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కొమర వెంకటేశ్ మొదటి వర్ధంతిని ఆదివారం చిత్రపురి కాలనీలో నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణికొండలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ గృహాల నిర్మాణానికి వెంకటేశ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సభ్యులు కాదంబరి కిరణ్, రఘు, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, వెంకటేశ్ సతీమణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి డంప్!

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


ట్రాఫిక్ రద్దీతో ఆగిపోయిన వాహనాలు

రాజేంద్రనగర్: ప్రధాన రహదారిపైనే భవన నిర్మాణ సామగ్రిని డంప్ చేస్తుండడంతో పాటు వ్యాపారులు తమ వాహనాలను రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తుండడంతో రాజేంద్రనగర్, జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి కిస్మత్‌పూర్‌కు వెళ్లే రహదారిపై తరుచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతు ంది. స్థానికులకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతున్నది. రాజేంద్రనగర్, బుద్వేల్, జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి టీచర్స్ కాలనీ మీదుగా కిస్మత్‌పూర్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డుకిరువైపులా ఇంటి యజమానులు నిర్మాణాలు చేపడుతూ వాటి సామగ్రిని రోడ్డుపైనే డంప్ చేస్తున్నారు. దీనికితోడూ షాపుల యజమానులు పార్కింగ్ కోసం స్థలాన్ని వదలకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలతో ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

174 లీటర్ల మద్యం స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్



మద్యంతో పట్టుబడ్డ నిందితులు హన్మంతు, ప్రదీప్

గచ్చిబౌలి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అక్రమంగా తరలిస్తుండగా 174 లీటర్ల మద్యాన్ని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకొని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. గచ్చిబౌలిలోని కొండాపూర్ రోడ్డులో ఉన్న పాయిజన్ వైన్‌షాపులో అంజయ్యనగర్‌కు చెందిన సి.హన్మంతు(26), వైన్‌షాపు మేనేజర్ ఎ.ప్రదీప్(33)లు మద్యాన్ని బెల్టుషాపునకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు శనివారం రాత్రి నిందితులిద్దరి నుంచి రూ.65 వేల విలువైన 239 క్వార్టర్ బాటిల్స్, 204 బీర్లు, 3 ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని గచ్చిబౌలి ఎస్ఐ శోభన్ బాబు తెలిపారు.

ఎస్ఎంసీ కన్వెన్షన్‌లో ఇఫ్తార్ విందు



రాజేంద్రనగర్: రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ వైస్ చైర్మన్ మహ్మద్ ఫైముద్దీన్ ఖురేషి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ శివరాంపల్లిలోని ఎస్ఎంసీ కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌తో పాటు హజ్, వక్ఫ్ బోర్డు చైర్మన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నాయకుడు అజారుద్దీన్, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గం బీ–బ్లాక్ అధ్యక్షుడు ఖాలేద్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, పార్టీ సీనియర్ నాయకులు మన్సూర్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డివిజన్‌లో ప్రచారం షురూ



రాజేంద్రనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రాజేంద్రనగర్ డివిజన్‌లో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆదివారం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ అంబేద్కర్ కాలనీ, మాణిక్యమ్మ కాలనీలో తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగుల రన్ ఫర్ హెల్త్



- మెగా 5కే రన్‌లో పాల్గొన్న 5 వేల మంది
- టీసీఎస్, యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహణ


5కే రన్ ను ప్రారంభించిన జి.ఎస్.రావు, రాజన్న

మాదాపూర్: భారతీయ కార్పొరేట్ సాఫ్ట్‌వేర్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌తో కలసి ఆదివారం రన్ ఫర్ హెల్త్ పేరుతో మెగా 5కే రన్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా యశోద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్ రాజన్నలు పాల్గొని 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో హెల్తీ లైఫ్‌స్టైల్ పట్ల అవగాహన కల్పించడం కోసం 5 వేల మందికిపైగా టీసీఎస్ ఉద్యోగులు వారి కుటుంబసభ్యులతో కలసి రన్ చేసినట్టు తెలిపారు. యశోద హాస్పిటల్ నుంచి హైటెక్ సిటీ ఐకియా మీదుగా మళ్లీ యశోద హాస్పిటల్‌కి చేరుకున్నారు. నా ఆరోగ్యం నాహక్కు అనే నినాదంతో వ్యాయామాన్ని మన దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. నడక మన శారీరక ఆరోగ్యాన్ని పెంచడంతోపాటు మానసిక అరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఎస్ ఉద్యోగులు, డాక్టర్లు, పారామెడిక్స్ , సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపట్టద్దు


అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు

అత్తాపూర్ : మూసీ పరీవాహక ప్రాంతంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని, ఇప్పటికే నిర్మించిన ప్రాంతాల్లో సైతం కూల్చివేతలు చేపడుతామని రాజేంద్రనగర్ సర్కిల్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్ అన్నారు. సుందరీకరణలో భాగంగా మూసీ పరీవాహక ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బిల్డర్ సత్తిరెడ్డి మూసీ పరీవాహక ప్రాంతంలో ఇష్టానుసారంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు 20 గజాల స్థలాల్లో ఇండ్ల నిర్మాణాలు చేపడితే కూల్చివేసిన ఉదాంతాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల నూతన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా అధికారులు మిగితా వారిపై కూడా చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

మూగ జీవాలను ప్రేమించాలి


వీధి కుక్కలను దత్తత తీసుకున్న మణికొండ వాసులు

మణికొండ: మూగ జీవాలను ప్రేమించడంతో పాటు కొన్నింటిని దత్తత తీసుకుని వాటికి కొత్త జీవితాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందని జంతు ప్రేమికుడు నవీన్‌కుమార్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ , అలకాపూర్ టౌన్‌షిప్ నేతాజీపార్కులో మణికొండ యానిమల్ రెస్క్యూ గ్రూప్ (మార్గ్) ఆధ్వర్యంలో మూగ జీవాల దత్తత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ సహకారంతో మూగ జీవాలకు అవసరమైన నీటి సౌకర్యం, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆదివారం 12 వీధి కుక్కలను పలువురు దత్తత తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్గ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీతవాయిద్య కచేరి

మాదాపూర్: కళాకారులు వివిధ వాయిద్యాలతో నిర్వహించిన సంగీత కచేరి అందరినీ ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం గురు పరంపర ఫౌండేషన్ భారతం పేరిట 120 మంది కళాకారులతో వయోలిన్ సింఫని కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు ఒక్కసారిగా సంగీతాన్ని ఆలపించి సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. ఆరభి ది సెంటర్ ఫర్ పెర్ఫామింగ్ భారతదేశంలో 25 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో భారతీయ శాస్త్రీయ సంగీత (కర్ణాటిక్) వాయిద్యాలను ప్రోత్సహిస్తోంది. కంపోజ్ చేసిన సంగీతంపై ఫ్లూట్, కీబోర్డు, సాక్సోఫోన్, వయోలిన్, గిటార్, సెల్లో, డబుల్‌బాస్, ట్రంపెట్, ఓబో, వీణ, సితార్ వంటి విభిన్న వాయిద్యాలపై పిల్లలకి శిక్షణ ఇచ్చి సంగీత కచేరిని ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన ర్యాలీ

చార్మినార్: ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కు కోగలదని గాంధీ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్, తెలంగాణ వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ ప్రతిభాలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో పూల్‌బాగ్ చమన్‌లో వివిధ రోగాలపై అవగాహన శిబిరంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యం ఎంతో అవసరమని, పౌష్టికాహారం తీసుకుంటూ.. వ్యాధులకు దూరంగా ఉంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. డాక్టర్ భరత్‌ప్రకాష్, డాక్టర్ రాజ్‌నారాయణ్ , రామక్రిష్ణ కాళమోనీ శ్యామ్‌రావు ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఖీరత్'

గోల్కొండ: రంజాన్ మాసం చివరి ఉపవాస దీక్షలు ఎంతో ముఖ్యమైనవని మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రీ అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాలబజార్‌లో ఆల్ ఇండియా ఖీర త్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులు, మదర్సాలో చదివే విద్యార్థులకు ఖీరత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ఖీరత్‌ను చక్కగా వినిపించి శభాష్ అనిపించుకున్నారు. ఖీరత్ చదివిన వారికి అక్తరీ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మతీన్‌అలీషా ఖాద్రీ మాట్లాడుతూ.. పిల్లల్లో చిన్ననాటి నుంచే ఖీరత్ గురించి వివరించాలన్నారు.